## క్లుప్తంగా

### రైతు బజారులో కేజీ టమోటా రూ.50 కే విక్రయం



**తెనాలిఅర్బన్:** టమోటా ధరలు ఆకాశానికి అంటుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం వాటిని రైతు బజారుల్లో సబ్సిడీపై విక్రయించేందుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా కొద్ది రోజుల నుంచి కేజీ రూ.50 కే విక్రయాలు ప్రారంభించింది. ప్రతిరోజు పట్టణంలోని పలు రైతు బజారుల్లో వీటిని విక్రయిస్తున్నారు. వీటి కోసం ప్రజలు క్యూలో నిలుచుని ఒక్కొక్కరు కేజీ చొప్పున వాటిని కొనుగోలు చేస్తున్నారు. శుక్రవారం బుర్రిపాలెం రోడ్డులోని రైతు బజారులో టమోటాల కోసం ఇలా బారులు తీరి కన్పించారు.

### ఎన్‌సీసీ అధికారులకు సరిఫికెట్ల పంపిణీ



**తెనాలిఅర్బన్:** తెనాలిలోని 22వ ఎన్‌సీసీ బెటాలియన్ కార్యాలయంలో శుక్రవారం గ్రూప్ కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎన్‌సీసీ అధికారులుగా శిక్షణ పూర్తి చేసిన పలువురికి సరిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడంవల్ల అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కమాండెంట్ అధికారి ఎ ఉమాశంకర్, చీఫ్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, అధికారులు కె బిక్షాలు, కె స్వామి, షేక్ ఖాదర్ బాషా, ఎం గోపి, ఎ అనిల్ కుమార్, సుబేదార్, మేజర్ మనోజ్ కుమార్, సుబేదార్ జ్యోతి పాల్గొన్నారు.

### రహదారికి తాత్కాలిక మరమ్మతులు



**అత్తోట(తెనాలి):** కొల్లిపర మండల పరిధిలోని అత్తోట నుంచి కుంచవరం వెళ్లే రహదారి వర్షాలకు అక్కడక్కడ దెబ్బతింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో స్వచ్ఛంద సంస్థ తాత్కాలిక మరమ్మతులకు ముందుకొచ్చింది. తెనాలిలోని ×పోస్ట్‌× స్వచ్ఛంద సంస్థ, ది అమరావతి మహిళా కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో పూర్తిగా రహదారి దెబ్బతిన్నచోట, శుక్రవారం రాళ్లతో కూడిన మట్టిని పోయించి రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు. ఇందుకోసం రూ.30 వేల వ్యయం చేశారు. కుంచవరం గ్రామస్తులు ఆయా సంస్థల బాధ్యులను అభినందించారు.

### నిరంతర వర్షాలతో అప్రమత్తత అవసరం

**నెహ్రూనగర్:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. వర్షా కాలంలో తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న నేపథ్యంలో అధికారులు, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత సచివాలయం కార్యదర్శులతో తమకు కేటాయించిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యల్ని గుర్తించాలని చెప్పారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయాలని ఆదేశించారు. గాలుల వల్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడినా, తాగునీటి సరఫరాకి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా పంపింగ్ కేంద్రాల్లో జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సంబంధిత ఏఈ, డీఈఈలు నేరుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీద ఎక్కడైనా చెట్లు పడితే వాటిని వెంటనే తొలగించడానికి పార్క్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. శిథిలావస్థ భవనాల్లో నివాసం ఉండే వారిని అప్రమత్తం చేస్తూ, వారి రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శుల్ని ఆదేశించారు. నగర ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే నగర పాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 నంబర్‌కి కాల్ చేయవచ్చని ఆమె సూచించారు.

### రేపు కవి సమ్మేళనం

**పాత గుంటూరు:** నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు - రమణ - బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హాలులో ఆదివారం 'కవి మిత్రుల సంగమం-కవి సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు సంఘం స్టేట్ కో- ఆర్డినేటర్ డాక్టర్ రంగిశెట్టి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో డాక్టర్ రమణ యశస్వి రచించిన 'మా గణపవరం కథలు' పుస్తక సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సమ్మేళనంలో కవులంతా పాల్గొని కవితల్ని వినిపించాలని ఆయన కోరారు.

# సంక్షేమ పథకాల అమలులో నూతన ఒరవడి

**ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్**



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరించి, సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

**కొల్లిపర:** సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడి సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శుక్రవారం కొల్లిపర సచివాలయం 2 పరిధిలో మూడవ రోజు తెనాలి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బట్టిప్రోలు వెంకటలక్ష్మి ఇంటి వద్ద నుంచి గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్‌ను ఆర్ఎంపీ డాక్టర్ శ్రీనువాసరావు , వెంకటలక్ష్మి పలువురు నాయకులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని సూచించారు. ప్రధాన రహదారుల రోడ్లు బాగా పల్లంగా ఉండడంవల్ల వర్షం వచ్చిన సమయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కావున సీసీ రోడ్లుగా నిర్మించి , డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. తప్ప కుండా నిదులు కేటాయించి డ్రైనేజీ, పల్లంగా ఉన్న రోడ్లులను సీసీ రోడ్లుగా నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన ఇలాగే సాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరిస్తే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. నాడు-నేడుతో వాటి రూపును మార్చుకుని సరికొత్తగా దర్శనమిస్తున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి(శివకోటి), పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అవుతు సీత నగేష్‌రెడ్డి , వ్యవసాయమార్కెట్ డైరెక్టర్ బట్టిప్రోలు వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు కెసన శ్రీలత, చిలువూరి ఝాన్సీ, నాయకులు చెంచల రామిరెడ్డి,అవుతు శ్రీనుశేఖరరెడ్డి, నెర్ల కుటుంబ రెడ్డి, జొన్నల శివారెడ్డి, పిల్లి గంగాధర్, మంద్రు రాజు, వార్డు మెంబర్లు, తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీఓ చంద్రమోహన్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, సచివాలయం సిబ్బంది, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ సమగ్రతకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

- అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు వెల్లడించొచ్చు
- రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

**తెనాలి:** ఓటరు జాబితా సవరణ కోసం నెలరోజులపాటు సంబంధిత అధికారులు ఇంటింటి సర్వేను చేపట్టనున్నట్టు తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ చెప్పారు. రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాల్సిందిగా సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఇదేరోజు నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు సమగ్ర ఓటరు సర్వే జరుగుతుందని ఆమె చెప్పారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో)లు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల పరిశీలన చేస్తారని తెలిపారు. చనిపోయినవారి పేర్లు, వేర్వేరు చోట్ల ఓటుహక్కు కలిగివుండడం, నకిలీ ఓట్లు వంటి వాటిని బీఎల్‌వోలు గుర్తిస్తారని తెలిపారు. కొత్తగా వయోజనులైన వారికి ఓటు హక్కు పొందే అవకాశం ఉందన్నారు. డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లను, నకిలీ ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చని చెప్పారు. ప్రస్తుతం ఓటరు జాబితా సవరణలోని నిబంధనలు, ఇతర అంశాలపై ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను గీతాంజలి శర్మ అడిగి తెలుసుకున్నారు.

పలు అభిప్రాయాలను వారు వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తిరుమలశెట్టి శ్రీనివాసరావు, అవుతు శేఖర్‌రెడ్డి, టీడీపీ నుంచి కాకుమాను కనకరాంబాబు, రావి సూర్యకిరణ్‌తేజ, వంగా సాంబిరెడ్డి, సీపీఎం నుంచి కొల్లిపర బాబూప్రసాద్, కాంగ్రెస్, జనసేన, సీపీఐ నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. తెనాలి ఇన్‌ఛార్జి తహసీల్దార్ హెనాప్రియ, కొల్లిపర తహసీల్దార్ జి.నాంచారయ్య, టీపీఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కాంప్లెక్స్‌లో మృతదేహం

**తెనాలిరూరల్:** తెనాలి మున్సిపల్ కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 మధ్య ఉంటుంది. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెంది రెండు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సులకపేట తహసీల్దార్ కార్యాలయం, ఎఆర్ఓ కార్యాలయం ఎదురు ప్రాంతం, పోలకంపాడు, సాయినగర్ కట్ట, ఉండవల్లి సెంటర్, సినిమా హాల్ రోడ్, జామాయిల్ తోట రోడ్, చైర్మన్ బజార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన కోరారు.

**మంగళగిరి:** కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాజ, చిన కాకాని ఎన్నారై ఆసుపత్రి వెనుక ఏరియా, పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, పట్టణ పరిధిలోని ఆటోనగర్‌లోగల ఏపీఐఐసీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల నిమిత్తం నిడమర్రు రోడ్, ఆర్ఆర్ టవర్స్, టిడ్కో గృహ సముదాయం, ఆటోనగర్ ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఏర్పడే అంతరాయాన్ని గుర్తించి వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

## గౌతమ్ స్కూల్‌కు నోటీసులు జారీ

**మంగళగిరి:** నగరంలోని గౌతమ్ స్కూల్‌కు నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2016-17 సంవత్సరంలో స్కూల్ మూసివేసి గుర్తింపు రద్దు చేసినా నిర్వాహకులు యథావిధిగా స్కూల్ నడుపుతున్నారని సమాచారం రావడంతో నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. స్కూల్‌లో ఇప్పటికే చదువుతున్న పిల్లలను ఇతర స్కూల్స్‌లో చేర్పించి స్కూల్‌ను మూసివేయాలని నోటీసులో సూచించినట్లు ఎంఈఓ తెలిపారు.

# నేడు తెనాలిలో చర్చావేదిక

**బాధితుల హృదయావిష్కరణలే 'చీకటిపువ్వు'**



కత్తి పద్మ

**తెనాలి:** కథారచయిత్రి కత్తి పద్మ కథాసంపుటి 'చీకటి పువ్వు'పై శనివారం తెనాలిలో చర్చావేదిక జరగనుంది. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో స్థానిక కవిరాజ పార్కులో సాయంత్రం ఆరు గంటలకు జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా ఏర్పాటయే సభలో రచయిత్రితోపాటు ప్రముఖ రచయిత్రి రమాసుందరి, ప్రజాసాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు చర్చలో పాల్గొంటారు. 'ఆహ్వానం లక్ష్మి' సంస్మరణలో ప్రతినెలా చర్చా కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నారు.

అనుభవం, మేధస్సు రంగరించి ఉత్తరాంధ్ర జీవ భాషలో కళాత్మకంగా వ్యక్తీకరించిన వాస్తవ జీవనగాథలు 'చీకటిపువ్వు' కథలు. మోహం, ప్రేమ, పెళ్లి లాంటివి మోసాలకు, దగాలకు, దౌర్జన్యాలకు, వేధింపులకు సులువు మార్గాలుగా స్త్రీల జీవితాలను ఎలా దుర్భరం చేస్తున్నాయో ఇందులోని కథలు కళ్లకు కడతాయి. సమాజం దృష్టిలో అల్పులుగా, పతితులుగా, నీచులుగా, అవకాశవాదులుగా, నీతి నియమాలు లేనివారిగా ముద్రవేయబడుతున్న వారిలో, ఆశ్చర్యం గొలిపే అద్భుతమైన మానవీయ లోతులను చూపుతాయి. ఉదాత్త వ్యక్తిత్వాలనూ గమనిస్తాం. బాధితుల హృదయావిష్కరణలే చీకటిపువ్వు సంకలనం లోని కత్తి పద్మ కథలు. నచ్చని మనిషినైనా, మనువునైనా, కొడుకునైనా, నీతినైనా తిరస్కరించగలిగే ధీరుల కథలే అన్నీ...

విశాఖపట్నంలో మహిళా విముక్తి కోసం కృషి చేస్తున్న కత్తి పద్మ ఇంటిపేరు నిజానికి 'కత్తి' కాదు. సమాజంలో మహిళా న్యాయం కోసం కృషిచేస్తున్న ఆమె నిబద్ధతకు ప్రజలిచ్చిన బిరుదు. 1960లో జన్మించిన పద్మ, ఏడుగురు అక్కచెల్లెళ్లు, నలుగురు సోదరులతో కలిసి పెరిగారు. ఉపాధ్యాయుడైన తండ్రి ప్రసాదరావు ఆదర్శాలతో ప్రభావితమయ్యారు. తండ్రి బాటలోనే ఉపాధ్యాయినిగా చేసినా, నాలుగు దశాబ్దాలుగా సామాజికసేవకే అంకితమయ్యారు. 1979-90 వరకు విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఉపాధ్యాయినిగా చేశారు. 1980-2006 వరకు మార్కిస్ట్-లెనినిస్ట్ పార్టీలో ఏపీటీఎఫ్, పీవోడబ్ల్యు సంఘాల్లో ఉన్నారు. 1990లో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తికాలపు కార్యకర్తగా కొనసాగారు. 2006లో ఆ పార్టీ జీవితాన్నీ వదిలి, స్వతంత్ర మహిళా హక్కుల కార్యకర్తగా మారారు. 'మహిళా చేతన' అనే మహిళా సంఘాన్ని స్థాపించి, అందులోనే మహిళల సమస్యలపై పనిచేస్తున్నారు.

ప్రతిరోజూ 5-10 మంది మహిళలు మహిళా చేతనను ఆశ్రయిస్తారు. ప్రేమ మోసాలు, వైవాహిక కష్టాలు, వరకట్న వేధింపులు, శారీరక హింస, గృహహింస, లింగ కుల రాజకీయాలు, మహిళలపై నేరాలు...వంటి సమస్యలను పరిష్కారానికి చట్టపరమైన మార్గంలో పద్మ, ఇతర చేతన సభ్యులు సాయపడతారు. మహిళలకు ఎక్కడ బెదిరింపులు వచ్చినా, పద్మ అక్కడ ముందుండి బాధితురాలికి న్యాయం జరిగేంతవరకు పోరాడతారు. వాకపల్లి రేప్ కేసు నుంచి ఉన్నావ్ ఘటన వరకు అన్ని సందర్భాల్లోనూ నిబద్ధతతో న్యాయం కోసం కృషిచేస్తున్నారు.

**మరోవైపు 2015 నుంచి...**

మరోవైపు 2015 నుంచి కథలు రాస్తున్నారు. తన దగ్గరకు వస్తుండే మహిళల జీవితపు అట్టడుగు పొరల్లోని కథనాలను అక్షరీకరిస్తున్నారు. ఆయా కథలతోనే 'చీకటిపువ్వు' సంకలనాన్ని తీసుకొచ్చారు. తన దగ్గరకు వచ్చిన కేసులను కథనం చేసిన చాత్రిబాబు దగ్గర్నుంచి దిగువ మధ్యతరగతి రైతు జీవితంలోని వేదనను చిత్రించిన నామిని, తాము వచ్చిన పల్లె, బస్తీ జీవితాలను కథనం చేస్తున్న విజయ్‌కుమార్‌లాంటి ఈ తరం కథకుల వరకు చాలామందే ఉన్నారు. అయినా కత్తి పద్మలా ఇంత విస్తారమైన కాన్వాస్‌తో ఇంత భిన్నమైన జీవితాలను కథనం చేసిన వారున్నారా? అంటే సందేహమేనంటారు రచయిత జీఎస్ రామ్మోహన్. 'అట్టడుగునపడి కాన్పించని కథలన్నీ కావాలిప్పుడు...అన్న ప్రయత్నంలో భాగమే ఈ కత్తి పద్మ కథలు.

## గురుకుల పాఠశాల విశ్రాంత ప్రిన్సిపల్ గొల్ల షీభారాణి మృతి



**తెనాలిఅర్బన్:** గురుకుల పాఠశాల విశ్రాంత ప్రిన్సిపల్ గొల్ల షీభారాణి (60) గురువారం మరణించారు. ఈమె భర్త మాణిక్యరావు పులిచింతల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. వీరికి ఇద్దరు సంతానం. షీభారాణి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా 1983లో కావూరులో బాధ్యలు స్వీకరించారు. అనంతరం ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని నిర్మల్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల్లో ప్రిన్సిపల్‌గా పనిచేశారు. మహబూబ్ నగర్‌లోని రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపల్‌గా కూడా పనిచేశారు. అకాడమిక్ గైడెన్స్ అధికారిగా పదోన్నతి పొంది నల్గొండలో పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. ఆమె భౌతికకాయాన్ని తెనాలి చినరావూరు తోటలోని వారి నివాసం వద్ద ఉంచారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె భర్త మాణిక్యరావు తెలిపారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి

**తాడేపల్లిరూరల్:** మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయంలో సంయుక్త సంచాలకులు శివపార్వతికి శుక్రవారం ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు దీనిని అమలు చేయలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చెత్త తరలించే ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, లారీ డ్రైవర్లను హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశామని తెలిపారు. ప్రభుత్వ శాఖాధిపతులు కలెక్టర్లు ప్రతి మూడో శుక్రవారం కార్మికులు, ఉద్యోగుల కోసం గ్రీవెన్స్ నిర్వహించాలనే ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ప్రతి నగరపాలక సంస్థ, పురపాలక సంఘంలో గ్రీవెన్స్ నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ గంజి రామ్మూర్తి, ఉపాధ్యక్షులు మల్లవరపు గణేష్, సంయుక్త కార్యదర్శి ఈర్ల రాము, ఈనాడు కమిటీ సభ్యులు పురుషోత్తమరెడ్డి, యూనియన్ కోశాధికారి నాగిపోగు సుమన్, కోటిబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

**కర్లపాలెం:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కర్లపాలెం ఎంపీడీవో, డీపీవో దాసరి రాంబాబు ఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమంపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటాలని చెప్పారు. ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది సహకారంతో ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల సహకారంతో నాటిన మొక్కలన్నీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కేశవనారాయణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, ఏపీవో సంగీతరావు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆక్రమిత దుకాణం తొలగింపు

**తెనాలి:** పట్టణ బోసురోడ్డులోని మలుపులో గల దుకాణాన్ని మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. చిట్టి ఆంజనేయస్వామి గుడి ఎదురుగా మూలమలుపులో గల షాపు ట్రాఫిక్‌కు అవరోధంగా ఉందన్న ఫిర్యాదులు రావడంతో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎస్.సుధాకరరావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సాంబశివరావు, సిబ్బందితో కలిసి తొలగించారు. అసిస్టెంట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో ఆక్రమణను తొలగించినట్టు సుధాకరరావు తెలిపారు. రోడ్ల వెంబడి ఆక్రమణల తొలగింపు కొనసాగుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలనూ తొలగిస్తామని చెప్పారు.

# లక్ష్మీపురం ప్రధాన రహదారికి మహర్దశ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి తదితరులు

**పట్నంబజారు:** నగరంలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన లక్ష్మీపురం ప్రధాన రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహనాయుడు శంకుస్థాపన చేశారు. రానున్న రోజుల్లో రహదారి కూడా 80 అడుగుల బీటీగా రూపు దిద్దుకోనుంది. నగరంలోని 32, 33 డివిజన్ పరిధిలోకి వచ్చే రహదారి నిర్మాణ పనుల్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో గుంటూరు అంతా గుంతల మయంగా మారిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చెప్పారు. దానిలో భాగంగానే లక్ష్మీపురం మదర్‌థెరిస్సా విగ్రహం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ప్రధాన రహదారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ తన నియోజకవర్గమైన గుంటూరు పశ్చిమ ప్రగతిపథంలో పరుగులు పెడుతున్నట్లు చెప్పారు. ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎక్కడ ప్రజలకు చిన్న ఇబ్బంది తలెత్తినా తక్షణమే స్పందించి సంబంధిత అధికారుల్ని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. తాజాగా మొదలైన అభివృద్ధి పనులతో లక్ష్మీపురం ప్రధాన రహదారి దశదిశ మారబోతున్నట్లు చెప్పారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గుంటూరులో లక్ష్మీపురం ఎంతో ముఖ్యమైన ప్రాంతమని, అనేక ప్రముఖ వ్యాపార సముదాయాలు ఉన్న ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన పాలకవర్గం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ , గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ గోపీ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి, కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

# 'డైట్'లో నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు

**సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్**



ఆసుపత్రిలో గోడలపై స్టిక్కర్లు తొలగిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

**గుంటూరు మెడికల్:** జీజీహెచ్ డైట్ క్యాంటీన్‌లో వైద్యులకు సరిపడా భోజనం వండించాలని, లోపల అపరిశుభ్ర వాతావరణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని డైట్ క్యాంటీన్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. వైద్యులకు సరిపడా ఆహారం అందించడం లేదని, డ్యూటీ వైద్యులు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. పీజీ వైద్య విద్యార్థులు సైతం డైట్ క్యాంటీన్‌పై ఫిర్యాదు చేశారు. డ్యూటీ డాక్టర్లకు తప్పనిసరిగా నాణ్యమైన భోజనం అందించాలని ఆయన నిర్వాహకులకు స్పష్టం చేశారు. మెను ప్రకారం వైద్యులకు భోజనం అందించకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఆసుపత్రి గోడలపై స్టిక్కర్లు అంటిస్తే సహించం**

జీజీహెచ్ క్యాజువాల్టీ గోడలపై స్టిక్కర్లు అంటించడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తనిఖీల్లో గోడలపై స్టిక్కర్లు తొలగించాలని ఆదేశించినా శానిటేషన్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో కోపగించుకున్నారు. స్వయంగా కొన్నింటిని తొలగించారు. ఆసుపత్రిలో అపరిశుభ్రమైన వాతావరణం కనిపిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## భార్యాభర్తల వివాదంలో పరస్పర ఫిర్యాదులు

**గుంటూరు ఈస్ట్:** భార్యాభర్తల వివాదంలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వి.ఆషా భర్త ఏసుబాబుతో గొడవ పడి కోర్టులో కేసు వేసింది. ఈ నేపథ్యంలో భర్త ఏసుబాబుతో పాటు అతని తల్లిదండ్రులు, ఆడపడుచులు కొట్టి, ఇంట్లోంచి బయటకు గెంటి వేశారంటూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆషాతో పాటు ఆమె తల్లిదండ్రులు, సోదరుడు ఏసుబాబు ఇంట్లోకి ప్రవేశించి సామాన్లు ధ్వంసం చేశారంటూ ఏసుబాబు, సోదరి కృపారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులపై కేసు నమోదు చేశారు.

## భావి ఉపాధ్యాయులుగా రాణించాలి



**గుంటూరు ఎడ్యుకేషన్:** ఉపాధ్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఉత్తమ క్రమశిక్షణతో భావి ఉపాధ్యాయులుగా రాణించాలని ఆర్వీఆర్ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కళాశాలలో శుక్రవారం 2022-24 బ్యాచ్ విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగయ్య మాట్లాడుతూ సమాజంలో విద్యకు ప్రాముఖ్యత ఎంతో ఉన్నతమైనదని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా భావి ఉపాధ్యాయులుగా ఎదిగే బీఈడీ విద్యార్థులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మోటూరి రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.